క్లుప్తంగా

ఉచిత యోగాను సద్వినియోగం చేసుకోండి



మాచర్ల: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే యోగా, వ్యాయామం తప్పనిసరిగా శ్రీ స్వామి వివేకానంద సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం గుంటూరు రోడ్డులోని స్వామి వివేకానంద మఠంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురితో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్‌సాహెబ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ముత్యాలపాపిరెడ్డి, చంద్రయ్య, పోలిశెట్టి పిచ్చయ్య, షేక్ చినలాలు సాహెబ్, శ్రీనివాసరావు, సైదమ్మ, రుక్మిణి, ఇరువంటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌కు రెండు బైకులు అందజేత

పిడుగురాళ్ల: స్థానిక పోలీస్ స్టేషన్‌కు రెండు పోలీస్ బైక్‌లు జిల్లా ఎస్పీ ఆదివారం అందజేసినట్లు పట్టణ సీఐ శ్రీరామ్ వెంకట్రావు తెలిపారు. పోలీస్ విధుల్లో ఉపయోగించే ఈ పోలీసు ద్విచక్ర వాహనాలు సిబ్బందికి ఉపయోగపడతాయని, నేరస్తులను పట్టుకోవడానికి, నైట్ డ్యూటీలు నిర్వహించడానికి, ప్రజా రక్షణ కోసం విధులు నిర్వహిస్తున్న పోలీసులకు ఈ వాహనాలు ఎంతగానో ఉపయోగపడతాయి అని చెప్పారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

మాచర్ల: పట్టణంలోని సప్తగిరి కాలనీలో వేంచేసియున్న శ్రీ విఘ్నేశ్వర, సుబ్రహ్మణ్యం, ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు అర్చకులు ఆదివారం తెలిపారు. ఈ వార్షికోత్సవంలో తెల్లవారుజాము నుంచి స్వామి వార్లకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



దొడ్లేరు(క్రోసూరు): జూలై 10వ తేదీన గురు పౌర్ణమిని పురస్కరించుని ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు దివ్య ఆశీస్సులతో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక పిడుగురాళ్ల, చిలకలూరిపేట కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని దొడ్లేరు గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాల ప్రచారం జరిగింది. శ్రీకృష్ణుడిని జగద్గురువుగా ఎందుకు పూజించాలో వారు వివరించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక పిడుగురాళ్ల, చిలకలూరిపేట కమిటీల అధ్యక్షులు, సభ్యులు కటికం సైదారావు, యద్దనపూడి వీరాంజనేయులు, కె.అరుణ, కె.కార్తీక్, కె.నారాయణమ్మ, సి.హెచ్.అనురాధ, ఎస్.వెంకటలక్ష్మి, డి.శ్రీను, ఎం.వీరయ్య, టి.రాఘవ, వి.సుందరం, వై.రామాంజనేయులు, కె.గంగయ్య, కోటేశ్వరమ్మ, వెంకటేశ్వర నాయక్ పాల్గొన్నారు.

పేదల ఆకలిని తీరుస్తున్న అమ్మ చేయూత ట్రస్ట్



సత్తెనపల్లి: అమ్మ చేయూత చారిటబుల్ స్వచ్ఛంద సంస్థ ద్వారా పేద ప్రజల ఆకలి తీరుస్తున్నారని రిటైర్డ్ ఏఎస్ఐ పిల్లుట్ల ఆంజనేయులు అన్నారు. అమ్మ చేయూత చారిటబుల్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని రైల్వే స్టేషన్, తాలూకా సెంటర్‌లోని అన్నార్తులకు చింకా వీరయ్య వర్ధంతి సందర్భంగా వారి ధర్మపత్ని చింకా శివమ్మ సహకారంతో ఆదివారం భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థ చేసే సేవా కార్యక్రమాలు ఎంతోమంది పేదలకు ప్రయోజనం చేకూరుస్తున్నాయన్నారు. ఇప్పటికే ఈ సంస్థ ద్వారా పేద మహిళలకి నిత్యావసర సరుకులు, విద్యార్థులకు నోటు పుస్తకాలు, రక్తదానం వంటి సేవా కార్యక్రమాలను చేపట్టారన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రెసిడెంట్ కుమ్మరి దస్తగిరి, సభ్యులు చింకా అంకమ్మరావు, పిక్కిలి రత్తయ్య, చామర్తి ఆంజనేయులు, నిమ్మలపల్లి నాగమల్లేశ్వరరావు, చింకా నారాయణ, పి.శివ, పిల్లుట్ల పెద్దన్న పాల్గొన్నారు.

మండల పశు వైద్యాధికారిగా బాలకృష్ణారెడ్డి

ముప్పాళ్ళ: మండల పశు వైద్యాధికారిగా జి.బాలకృష్ణారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. బెల్లంకొండ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన కె.కరుణాకరరెడ్డి రొంపిచర్ల మండలానికి వెళ్లారు. అలాగే మాదల పశు వైద్యాధికారిగా వి.శిరీష సత్తెనపల్లి మండలంలోని పెదమక్కెన పశు వైద్యాధికారిగా పని చేస్తూ బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు పనిచేసిన ఎం.పుల్లారెడ్డి సత్తెనపల్లి కొమెరపూడి పశు వైద్యాధికారిగా బదిలీపై వెళ్లారు.

చదువులు సాగేదెలా..!

- ప్రభుత్వ పాఠశాలలలో టీచర్ల కొరత
- 54 పోస్టులు ఖాళీ
- తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య
- ప్రైవేటు పాఠశాలల వైపు తల్లిదండ్రుల చూపు



మల్లవరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

రెంటచింతల: ప్రభుత్వ పాఠశాలలపై శ్రద్ధ కనిపించడం లేదు. కూటమి ప్రభుత్వం కొత్త విధానాలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. దీనికి తోడు పాఠశాలలలో 2025–2026 విద్యా సంవత్సరానికి సంబంధించి ఉపాధ్యాయుల కొరత ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే ఉపాధ్యాయుల కౌన్సెలింగ్ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో విద్యార్థులు, వారి తల్లి దండ్రులు ప్రైవేటు పాఠశాలల వైపు చూస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు గ్రామాలలో ఆదరణ తగ్గుతోంది.

ఉపాధ్యాయులు ఉండాల్సింది ఇలా...

మండలంలో పాఠశాలల్లో మొత్తం 120 మంది ఉపాధ్యాయులు అవసరం కాగా ఇప్పటి వరకు కేవలం 66 మంది మాత్రమే ఉన్నారు. మిగిలిన 54 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం 1998, 2008 బ్యాచ్‌లకు చెందిన కనీస వేతనం టీచర్లు 320 మంది ఉండగా వారికి జరుగుతున్న ఉపాధ్యాయుల కౌన్సెలింగ్‌లో కూడా ఖాళీలు, క్లస్టర్ ఖాళీలు మొత్తం 620 మందిని చూపిస్తుండటంతో రెంటచింతల మండలానికి కేవలం 10 నుంచి 12 టీచర్ పోస్టులు మాత్రమే భర్తీ అయ్యే అవకాశం ఉందని ఉపాధ్యాయ సంఘం నాయకులు తెలిపారు. మల్లవరం, మంచికల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో ఆరుగురు చొప్పున, పశర్లపాడు, జెట్టిపాలెం, తుమృకోట, గోలి గ్రామాలలోని ఎంపీయూపీఎస్ పాఠశాలలలో 4 గ్గురు చొప్పున, తుమృకోట హరిజన కాలనీలోని ఎంపీపీఎస్‌లో మరో 4 టీచర్ పోస్టులతో పాటు పలు ప్రభుత్వ పాఠశాలలో మరో 22 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ఆసక్తి చూపని ఉపాధ్యాయులు...

పల్నాడు జిల్లాలో చివరి మండలం కావడం వలన రెంటచింతల మండలంలో పని చేయడానికి ఉపాధ్యాయులు ఆసక్తి చూపడం లేదు. టీచర్ల కొరతతో ప్రభుత్వ పాఠశాలలలో చేరే విద్యార్థుల సంఖ్య ఇప్పటికే తగ్గుతోంది. మండలంలో మొత్తం ప్రభుత్వ పాఠశాలల్లో 3,332 మంది విద్యార్థులు చదువుతున్నారు.

మండలంలో పాఠశాలలు	
ప్రాథమిక పాఠశాలలు	22
ప్రాథమికోన్నత	4
ఉన్నత పాఠశాలలు	6

మంచి చదువు కావాలి...



ప్రభుత్వ పాఠశాలలో ఉచితంగా చదువు చెబుతున్నా ఇక్కడ అదనపు తరగతులు నిర్వహించడం లేదు. పూర్తిస్థాయిలో పర్యవేక్షణ లేదు. అందు వలన ప్రైవేటు పాఠశాలలో చేర్పించాల్సి వచ్చింది. ప్రైవేటు పాఠశాలలో చదవడానికి ఖర్చు ఎక్కువ అయిన తప్పటం లేదు.

–దొడ్డా చిన్న బాలకోటయ్య, మల్లవరం

బాగా చదువుకోవాలని ఇక్కడకు వచ్చా...



నేను బాగా చదువుకోవాలని ఇక్కడ వచ్చి ఎస్సీ సంక్షేమ వసతి గృహంలో ఉంటూ సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్నా. మా గ్రామంలో చదువుకోవడానికి అవకాశం లేకపోవడంతో ఇక్కడకు వచ్చా. అన్ని సబ్జెట్‌లకు ఉపాధ్యాయులు ఉన్నారు. ప్రతి రోజు తరగతులు జరుగుతుండటంతో పాటు ఆటలకు అవకాశం కల్పిస్తున్నారు.

–రెంటపాళ్ల అరవింద్, విద్యార్థి, పశర్లపాడు

టీచర్ పోస్టులు డీఎస్సీ ద్వారా భర్తీ



మండలంలో 54 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 17 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఆగస్టులో జరిగే డీఎస్సీ ద్వారా భర్తీ చేయాల్సి ఉంది. ప్రస్తుతం జరుగుతున్న కనీస వేతన టీచర్ల 1998, 2008 బ్యాచ్‌ల కౌన్సిలింగ్ ద్వారా కొంత మంది ఎస్‌జీటీ పోస్టులు భర్తీ కానున్నాయి. 50 శాతం ఉపాధ్యాయులు ఉండాలనే నిబంధనల మేరకు బదిలీ అయిన వారిలో 16 మంది ఉపాధ్యాయులను వెనుక్కి పిలిపించడం జరిగింది.

–వై.శివనాగేశ్వరరావు, ఎంఈఓ–2, రెంటచింతల

బస్టాండ్ సెంటర్లో సులభ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలి

రెంటచింతల: స్థానిక బస్టాండ్ సెంటర్లో సులభ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని కన్నెగంటి హనుమంతు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్.శ్రీనివాసరావు ఆదివారం కోరారు. ప్రతి రోజు మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారని చెప్పారు. ఇక్కడ సులభ్ కాంప్లెక్స్ లేకపోవడం వలన ప్రయాణికులతో పాటు వ్యక్తిగత పనులపై రెంటచింతలకు వచ్చే వివిధ గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక రెవెన్యూ, గ్రామ పంచాయతీ అధికారులు స్థలం కేటాయించి సులభ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానిక నజీరుద్దీన్‌షా చెరువు కట్టపై వాకింగ్ ట్రాక్, చిల్డ్రన్స్ పార్కు ఏర్పాటు చేయాలని, పంట పొలాలకు వెళ్లే పలు రహదారులను అభివృద్ధి చేయాలని, గ్రంథాలయానికి స్థలం కేటాయించాలని, రైలుపేట కాలనీలో హిందూ శ్మశాన వాటిక నిర్మించడానికి వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు.

హరికృష్ణ కుటుంబానికి పరామర్శ



హరికృష్ణని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్సీ కృష్ణారెడ్డి

దాచేపల్లి: మండలంలోని తంగెడ గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ యువనేత ఉప్పుతల యల్లయ్య కుమారుడు హరికృష్ణని మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి ఆదివారం పరామర్శించారు. హరికృష్ణపై ఇటీవల పోలీసులు అక్రమ కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఈ క్రమంలో దాచేపల్లి పోలీస్ స్టేషన్లో సీఐ భాస్కర్ హరికృష్ణను చిత్రహింసలు గురిచేయడంపై మానవ హక్కుల కమిషన్ కూడా ఫిర్యాదు చేశారు. ఇటీవల బెయిల్‌పై విడుదలైన హరికృష్ణని మాజీ ఎమ్మెల్సీ కృష్ణారెడ్డి పరామర్శించి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో పార్టీ మండల కన్వీనర్ కోట కృష్ణ, నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, నాయకులు అరికట్ల మల్లారెడ్డి, ఉప్పుతల నరసింహారావు, దేవల్ల వీరస్వామి, గోగి రెడ్డి వెంకట్ రెడ్డి, వట్టె రామచంద్ర రెడ్డి, కాసర్ల నర్సింహా రెడ్డి, వట్టె చంద్ర రెడ్డి ఉన్నారు.

సరస్వతి శిశు మందిరాలను ఆదరించాలి



మాట్లాడుతున్న మంత్రి సుధాకర్ రెడ్డి

అమరావతి: సరస్వతి శిశు మందిరాలలో విద్యార్థులకు జాతీయ భావన, నైతిక విలువలను బోధిస్తూ వారిని సంస్కారవంతులుగా, దేశ భక్తులుగా తీర్చిదిద్దుతున్నామని దక్షిణ మధ్య క్షేత్ర సంఘటన్ మంత్రి లింగం సుధాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక సరస్వతి శిశు మందిరంలో సరస్వతి విద్యాపీఠం విజయవాడ సమితి ఆధ్వర్యంలో గుంటూరు విభాగ్ నూతన ప్రబంధకారిణి అవగాహన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరస్వతి శిశు మందిరాలను ఆదరించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. చదువుకున్న చదువు సమాజానికి, కుటుంబానికి, దేశానికి ఉపయోగపడే విధంగా ఉండాలని, సంస్కారవంతులుగా మార్చేదే నిజమైన విద్య అన్నారు. అటువంటి విద్యను అందించేందుకు విద్యాభారతి ఎన్నో వేల మంది కార్యకర్తలతో సేవా భావంతో దేశ వ్యాప్తంగా 24 వేల పాఠశాలలను నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో గుంటూరు విభాగ అధ్యక్షుడు వనమా పూర్ణచంద్రరావు, కార్యదర్శి చిరుమామిళ్ల గోపికృష్ణ, విద్యాభారతి ఏపీ కార్యదర్శి జేపీఎస్ శాస్త్రి, విద్యాభారతి ఏపీ సంఘటన్ కార్యదర్శి కన్నా భాస్కర్, పాఠశాల సమితి అధ్యక్షుడు పులిపాటి వెంకట పవన్ కుమార్, పాఠశాల అధ్యక్షుడు శనగవరపు రామ్మోహన్ శర్మ, ప్రధానోపాధ్యాయులు కోలా వెంకటేశ్వరరావు, ఉమ్మడి గుంటూరు జిల్లాలోని సరస్వతి శిశు మందిరాల కార్యవర్గ సభ్యులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆనాటి జ్ఞాపకాలను పంచుకుంటూ...



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

అమరావతి: ఎప్పుడో 43 ఏళ్ల క్రితం ఒకే పాఠశాలలో కలిసి చదువుకుని నేడు దేశవిదేశాలలో అనేక రకాల వృత్తులలో బిజీబిజీగా జీవనం సాగిస్తున్న అమరావతి శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్ 1981–82 పదవ తరగతి విద్యార్థులు ఆదివారం నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో కలుసుకుని ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. 1981–82 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన సుమారు వంద మంది ఆదివారం రామకృష్ణ హిందూ హైస్కూల్ ఆవరణలో కలుసుకున్నారు. పూర్వ విద్యార్థులంతా కలుసుకుని తమ వ్యక్తిగత జీవితాలలోని అనేక విషయాలను ఆత్మీయంగా మిత్రులతో పంచుకున్నారు. ఎక్కడెక్కడి నుంచో ఎంతో వ్యయప్రయాసలకు ఓర్చి ఈ సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలను సందర్శించి గురువులు, మిత్రులతో తమ అనుభవాలను పంచుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో ఉదయం 9 గంటలకు వచ్చిన పూర్వ విద్యార్థులందరూ తమ తమ కుటుంబాల పూర్తి వివరాలతో పత్రాలను పూర్తిచేసి ఒకరినొకరు పరిచయం చేసుకున్నారు. తదుపరి తమ జీవిత అనుభవాలను పంచుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు గురువందనం చేశారు. అలాగే ప్రస్తుత గురువులను సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాలకు తమ వంతు ఆర్థిక సాయాన్ని అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమ్మేళనానికి పూర్వ విద్యార్థులు, నేటి ఉపాధ్యాయులు, సిబ్బంది హాజరయ్యారు.

యువత పోరుకు తరలిరండి

మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

పెదకూరపాడు: వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం నిర్వహించే యువత పోరు కార్యక్రమానికి పెదకూరపాడు నియోజకవర్గంలోని నిరుద్యోగులు భారీగా తరలిరావాలని పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన గుంటూరులోని కార్యాలయంలో మాట్లాడుతూ పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరోద్యోగుల పక్షాన నిలుస్తూ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేలు భృతి తక్షణమే ఇవ్వాలని కోరుతూ నిర్వహించే ధర్నాకు నిరుద్యోగులు తరలిరావాలన్నారు. అనంతరం జిల్లాకలెక్టర్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేస్తామన్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలోని యువకులు, నిరుద్యోగ యువతీయువకులు, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యువజన విభాగ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పెదకూరపాడు ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య పాల్గొన్నారు.

వ్యవసాయ సంక్షోభం - ప్రత్యామ్నాయ విధానాలపై సెమినార్



88త్యాళ్లూరు(క్రోసూరు): మండలంలోని 88త్యాళ్లూరులో అమరవీరుల స్థూపం వద్ద ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం క్రోసూరు మండల కార్యదర్శి అత్తోట వెంకటప్పయ్య అధ్యక్షతన వ్యవసాయ సంక్షోభం – ప్రత్యామ్నాయ విధానాలు అంశంపై సెమినార్ నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రవిబాబు మాట్లాడుతూ 88త్యాళ్లూరు గ్రామం రైతుల కోసం పోరాటం చేసిన అమరవీరుల త్యాగాలకు కేంద్రమని, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో వారి త్యాగాలను స్మరించుకుంటూ, ప్రస్తుతం రైతుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలను తిప్పి కొట్టాలని అన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలపై రైతు సంఘం ఆధ్వర్యంలో అన్ని స్థాయిల్లో అధికారులను, ప్రజా ప్రతినిధులను కలిసి విన్నవించడం జరిగిందని, వివిధ స్థాయిలో పోరాడటం జరిగిందని అన్నారు. ముందుగా గ్రామంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట మృతవీరుల స్మారక స్థూపం వద్ద సత్తెనపల్లి పాత తాలూకా పరిధిలో రైతాంగం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరులకు గుర్తుగా నిర్మించిన అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఆవుల ఆంజనేయులు, అత్తోట బాలయ్య, రావెళ్ల వెంకటేశ్వర్లు, ఏపూరి వెంకటేశ్వర్లు, చిలక యేషియ్య, వల్లశెట్టి వెంకటేశ్వర్లు, వి.అనూష, కొరివి అన్నపూర్ణమ్మ, గల్లా రమణమ్మ, తిమ్మిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాజమోహనరావు సేవలు విలువైనవి

చిలకలూరిపేట: కళారంగానికి ప్రగడ రాజమోహనరావు అందించిన సేవలు ఎంతో విలువైనవని పలువురు వక్తలు కొనియాడారు. ఇటీవల మృతి చెందిన కళానిలయం వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రగడ రాజమోహనరావు సంతాప సభను పట్టణంలోని వెంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ సుమారు 40 ఏళ్ల కిందట కళానిలయం సంస్థను స్థాపించి అప్పటి నుంచి నిర్విరామంగా నృత్య, సంగీత పోటీలు నిర్వహించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. సాంప్రదాయ కళలకు ఆదరణ తగ్గిపోతున్న క్రమంలో జాతీయ స్థాయిలో భరతనాట్యం, కూచిపూడి, జానపద నాట్య, సంగీత పోటీలు నిర్వహించిన కళాతపస్వి అని కొనియాడారు. సుమారు గత రెండేళ్లుగా ఆరోగ్యం ఏ మాత్రం సహకరించకున్నా, మంచానికే పరిమితమై కూడా జాతీయ స్థాయి నృత్య, సంగీత పోటీలు నిర్వహించటం ఆయన చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రిటైర్డ్ టెలికం జేఈఓ ఏవీ శివయ్య అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో నాయుడు శివకుమార్, మామిడి నెహ్రూ పాల్గొన్నారు.

కిరీటిరెడ్డి సేవలు మరువలేనివి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు

మాచర్ల: మాచర్ల ప్రాంతంలో 36 ఏళ్లగా ప్రభుత్వ పాఠశాలల్లో సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయుడుగా, హెచ్‌ఎంగా పనిచేసి ఎంతో మంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దిన గాదె కిరీటిరెడ్డి సేవలు మరువలేనివని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్మన్ మదార్ సాహెబ్ కొనియాడారు. ఆదివారం పట్టణంలోని నెహ్రూనగర్, వీవీ గార్డెన్స్‌లో హెచ్‌ఎంగా పదవీ విరమణ చేస్తున్న గాదె కిరీటిరెడ్డి సన్మాన సభ నిర్వహించారు. ఈ ప్రాంతంలో మదర్‌థెరిస్సా సేవా సమితి, గతంలో యూటీఎఫ్ నాయకుడుగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించిన ఘనత ఆయనకే దక్కుతోందని చెప్పారు. ఎంఈఓలు సయ్యద్ జఫ్రుల్లా, అల్లి సురేష్ మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయుడుగా 2005లో, 2011లో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ఉపాధ్యాయుడుగా అవార్డులు అందుకున్నారన్నారు. సాంఘిక సేవలో పలువురు పేదలకు సేవలందిస్తూ యూటీఎఫ్ రాష్ట్ర స్థాయిలో పనిచేసి పదవీ విరమణ బాధాకరమన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ చైర్మన్ కూనిశెట్టి వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు యెనుముల కేశవరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు, సీనియర్ న్యాయవాది సిహెచ్.నాగిరెడ్డి, యూటీఎఫ్ అధ్యక్షులు షేక్ నజీర్, ఎస్టీయూ అధ్యక్షులు పీఎస్ ఎక్సమస్ జాన్, ఏపీటీఎఫ్ అధ్యక్షుడు కె.కృష్ణార్జీ నాయక్, ఎ.సుధాకర్ పాల్గొన్నారు.

దాచేపల్లి గ్రామాభివృద్ధి కృషి



కేసానుపల్లిలో సిమెంట్ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

దాచేపల్లి: గ్రామాలాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కేసానుపల్లిలో నిర్మించిన పలు సిమెంట్ రోడ్లను, కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయంలో చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ.. సూపర్ సిక్స్ హామీలను అమలు చేసి ప్రజలకు అండగా ఉంటామని, మరిన్ని సంక్షేమ అభివృద్ధి పథకాలను అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నెల్లూరు రామకోటయ్య, చెట్టిపోగు ఏసుదానం, నెల్లూరు కోటయ్య, కోట సాయికుమార్, బెల్లం కొండ బద్రి, తోట వెంకటేశ్వర్లు, పగడాల భాస్కరరావు, పుల్లయ్య, తంగేళ్ల శ్రీనివాసరావు, గొళ్ల నారాయణ, షేక్ వలి పాల్గొన్నారు.

రెండో రోజు కొనసాగిన ఎస్సీ కాలనీ వాసుల దీక్ష



పట్టణ తాలూకా సెంటర్‌లో ఆమరణ దీక్షలో లక్కరాజుగార్లపాడు ఎస్సీ కాలనీ వాసులు

సత్తెనపల్లి: లక్కరాజుగార్లపాడు ఎస్సీ కాలనీకి సంబంధించిన భూ సమస్యకు పరిష్కారం చూపించకుంటే న్యాయపోరాటం తప్పదని ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ జంగాల శ్రీనివాసరావు అన్నారు. లక్కరాజుగార్లపాడు ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ వాసుల ఆమరణ నిరాహార దీక్షలు ఆదివారం రెండవ రోజుకు చేరుకున్నాయి. ఆమరణ దీక్ష చేస్తున్న జంగాల శ్రీనివాసరావు, ముప్పవరపు నాగరాజులకు మద్దతుగా రిలే దీక్షలు గ్రామ అధ్యక్షుడు బందెల జగన్ వారి కమిటీ సభ్యులు కూర్చున్నారు. దీక్షలను సత్తెనపల్లి మాదిగ ఉద్యోగ సమాఖ్య నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా జంగాల శ్రీనివాసరావు మాట్లాడుతూ పంచాయతీ సైడ్ కాలువ, పంచాయతీ రోడ్‌లను కలుపుకొంటూ గ్రావెల్ మట్టి తోలితే ఈ నెల 8వ తేదీ నుంచి గ్రావెల్ మట్టి తీయించలేని స్థితిలో పంచాయతీ సెక్రటరీ, ఎస్టాబ్లిష్‌మెంట్ అధికారి, మండల డెవలప్‌మెంట్ అధికారులు ఉన్నారన్నారు. ఎందుకు అంత ఉదాసీనత, ఎందుకు సమస్య పట్ల నిర్లక్ష్యం, దీన్ని ఆదర్శం చేసుకొని మరొకరు మరొక సమస్య సృష్టించినా అధికారులు ఇలాగే ఉంటారా అని ప్రశ్నించారు. ఈ సమస్య పరిష్కారం చెయ్యలేకపోతే గ్రామస్తులకు మీరిచ్చే సందేశం ఏమిటని, సమస్యకు పరిష్కారం చూపించకుంటే న్యాయపోరాటం తప్పదని హెచ్చరించారు. దీక్షలో గ్రామ యూత్ ప్రెసిడెంట్ యరసాని జయరావు, గ్రామ ఉపాధ్యక్షుడు వెల్లటూరి ప్రభాకర్, మన్నం విజయకుమార్, బందెల యేసోబు, జంగాల అశోక్, జంగాల నాగమల్లేశ్వరరావు, జొన్నలగడ్డ చంటి, జొన్నలగడ్డ వెంకట్రావు, చిలక మరియదాస్ తదితరులు ఉన్నారు.

బ్రహ్మం గారి దేవాలయానికి నిధులు మంజూరు చేయాలి

విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు రమేష్



దేవాలయం వద్ద సమావేశమైన సంఘు సభ్యులు, ప్రతినిధులు

రాజుపాలెం: రహదారి నిర్మాణంలో కోల్పోతున్న బ్రహ్మంగారి దేవాలయ పునః నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని సత్తెనపల్లి నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు రమేష్ కోరారు. మండల అనుపాలెం గ్రామంలోని బ్రహ్మంగారి దేవాలయంలో విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు మాట్లాడుతూ 40 ఏళ్లుగా ఉన్న దేవాలయం రహదారి నిర్మాణంలో కోల్పోతున్నందున హైవే వారు గుర్తించి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ దేవాలయం దాతలు ఇచ్చిన 10 సెంట్ల స్థలంలో ఏర్పాటు చేయబడిందని, రూ.50 లక్షలు వెచ్చించి మండపం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రతి రోజు ధూప, దీప, నైవేద్యాలు జరుగుతున్నందున భక్తుల విశ్వాసాన్ని పరిగణలోకి తీసుకుని నిధులు మంజూరు చేయాలని, నిధుల మంజూరుకు ఎమ్మెల్యే లక్ష్మీనారాయణ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి రంగు నాగభూషణం, గౌరవ అధ్యక్షుడు కోటగిరి పోతులూరయ్య, గ్రామ సర్పంచ్ సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ బండి కోటినాగిరెడ్డి, తోట రఘునాథ్‌రావు, రాయచంద్రశేఖర్‌రెడ్డి, బెల్లంకొండ బ్రహ్మం, వీర్ల శ్రీనివాసరావు, సిరిగిరి అర్జునరావు, నల్లగొర్ల ఆవులయ్య, తిపర్తి శంకరరావు తదితరులు ఉన్నారు.

రైతులకు డ్రోన్ పంపిణీ

నాదెండ్ల: వ్యవసాయ రంగంలో అధునాతన పద్ధతులను రైతులు అందిపుచ్చుకుని లాభసాటి సాగు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి శ్రీలత చెప్పారు. సాతులూరు గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో వ్యవసాయానికి వినియోగించే డ్రోన్‌ను రైతులకు అందించారు. గ్రామానికి చెందిన నార్నె శరభయ్య, వేజెండ్ల కోటేశ్వరరావు, వేజెండ్ల శ్రీనివాసరావు, ఈదర ఆంజనేయులు, కమ్మ కృష్ణప్రియ గ్రూపుకు రూ.9.80లక్షల విలువైన రసాయన మందులు పిచికారీ చేసే డ్రోన్‌ను పంపిణీ చేశారు. ఇందులో ప్రభుత్వం రూ.7.84 లక్షలు (80 శాతం) సబ్సిడీ అందించగా, రైతుల వాటాగా రూ.1.96 లక్షలు (20 శాతం) చెల్లించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ వ్యవసాయానికి వినియోగించే ఎన్నో రకాల ఆధునిక పరికరాలను ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తుందన్నారు. రైతులు గ్రూపుగా ఏర్పడి పరికరాల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులైన గ్రూపులకు ప్రభుత్వ చేయూత లభిస్తుందన్నారు. సర్పంచ్ మునుగు శోభారాణి, మండల టీడీపీ అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ, ఏఈఓలు రామారావు, వేణుగోపాలరావు, కెనరా బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.